www.prajasakti.com
ప్రజాశక్తి
బుధవారం 16 అక్టోబర్ 2024
5
తిరుపతి



కుటుంబాన్ని పరామర్శిస్తున్న పరిమళ

తిరుపతి 'రెడ్' జోన్




కోటలో నీట మునిగిన వరినారు

వాకాడులో అత్యధికంగా 89.6 మి.మీ.
అత్యల్పం పాకాలలో 10.2 మి.మీ.
నేడు విద్యాసంస్థలకు సెలవు : కలెక్టర్

ప్రజాశక్తి - తిరుపతి టౌన్, యంత్రాంగం

బంగాళాఖాతంలో అల్పపీడన ప్రభావం వల్ల ఉమ్మడి చిత్తూరు జిల్లాల్లో సోమ, మంగళవారాల్లో ఎడతెరపి లేకుండా వర్షం కురుస్తూనే ఉంది. బుధ, గురువారాల్లో అతి భారీ వర్షాలు కురవనున్నాయని 'రెడ్'జోన్‌గా అధికార యంత్రాంగం ముందస్తు హెచ్చరికలతో అప్రమత్తం చేస్తోంది. తిరుపతి జిల్లాలోని వాకాడులో 89.6 మిల్లీమీటర్ల వర్షపాతం అత్యధికంగా నమోదయ్యింది. సూళ్లూరుపేట 66.2, గూడూరు 63.8, చిట్టమూరు 61.2, చిల్లకూరు 61.2, కోట 58.4, తడ 57. 0, బి ఎన్ కండ్రిగ 53.8, డక్కిలి 50.6, బాలాయపల్లి 49.6, శ్రీకాళహస్తి 47.0, కేవీబీపురం 46.2, ఓజిలి 45.2, వడమాల పేట 44.2, పెళ్లకూరు 42.8, సత్యవేడు 42.0, నాయుడుపేట 41.6, వెంకటగిరి 41.2, పుత్తూరు 41.0, ఏర్పేడు 38.2, వరదయ్యపాలెం 36.0, తొట్టంబేడు 32.8, నారాయణవనం 31.0, దొరవారి సత్రం 30.2, పిచ్చాటూరు 28.2, నాగలాపురం 25.4, తిరుపతి రూరల్ 25.2, చంద్రగిరి 22.2, రామచంద్రపురం 22.0, తిరుపతి అర్బన్ 21.2, ఎర్ర వారి పాలెం 18.0, రేణిగుంట 16.6 చిన్నగొట్టిగల్లు 16.4, పాకాల 10.2 మి.మీ.గా నమోదయినట్లు గణాంకాల అధికారులు పేర్కొన్నారు.

అక్రమ నిర్మాణాల తొలగింపుకు చర్యలు : కమిషనర్

తుపాను ప్రభావంతో రానున్న మూడు రోజులు తీవ్ర వర్షాలు కురిసే అవకాశం ఉందని కమిషనర్ ఎన్.మౌర్య తెలిపారు. మురుగునీటి కాలువలు పొంగి పొర్లకుండా ఎక్కడికక్కడ చెత్త తొలగిస్తున్నామని అన్నారు. డ్రైనేజీ, కాలువలు పొంగినా, వర్షాల వలన ఎటువంటి ఇబ్బందులు ఉన్న హెల్ప్ లైన్ 0877 2256766కు ఫిర్యాదు చేయచ్చునని అన్నారు. లోతట్టు ప్రాంతాల్లో ఇబ్బందులు లేకుండా ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టామని అన్నారు. ఎక్కడైనా కాలనీల్లో , ఇండ్లలో నీరు ఎక్కువగా చేరితే పంపింగ్ చేయడానికి మోటార్లతో సిద్ధంగా ఉన్నామని అన్నారు. కాలువలు, డ్రైనేజ్ లపై అక్రమ నిర్మాణాలు చేయడం వల్లే ఎక్కువగా నీరు రోడ్లపైకి వస్తున్నాయని అన్నారు. ఇటువంటి నిర్మాణాల తొలగింపుకు చర్యలు చేపడతామని అన్నారు. తిరుపతిలో 17 ప్రాంతాల్లో పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు.

తిరుమలలో ఎడతెరపి లేని వర్షం

ప్రజాశక్తి -తిరుమల

తిరుమలలోనూ తెల్లవారుజాము 4 గంటల నుంచి ఎడతెరిపి లేకుండా వర్షం పడుతోంది, దీనివల్ల తిరుమాడ వీధులు నీటితో నిండిపోయాయి. తిరుమలలో కురుస్తున్న భారీ వర్షం భక్తులకు తీవ్ర ఇబ్బందులను కలిగిస్తోంది. భారీగా వర్షం పడుతున్న నేపథ్యంలో తిరుమల తిరుపతి దేవస్థానం అడిషనల్ ఈఓ వెంకయ్య చౌదరి స్పందిస్తూ, భక్తులను రక్షణ చర్యలు తీసుకోవాలని సూచించారు. 'భక్తులు వర్షంలో తడిచిపోవద్దని, వీలైనంత త్వరగా షెడ్లు ఖాళీ చేసిన వెంటనే లోపలికి తరలిస్తామని' ఆయన అన్నారు. ఘాట్ రోడ్డులో కొండరాళ్లు పడే అవకాశం ఉండడంతో వాహన దారులు జాగ్రత్తలు పాటించాలని అలిపిరి సిబ్బంది సూచిస్తున్నారు.

కోటలో మునిగిన నారుమడులు

ప్రజాశక్తి -కోట

తుపాన్ ప్రభావం వల్ల రెండు రోజులుగా ఎడతెరపి లేకుండా వర్షాలు పడడంతో కోట మండలంలోని పలు ప్రాంతాల్లోని పంటపొలాల్లో నారు మడులు నీట మునిగాయి. నారుమడులతో పాటు తిన్నెలపూడి, లక్ష్మక్క కండ్రిగ, వెంకన్నపాలెం, తిమ్మనాయుడు పాలెం, అగ్రహారం, గూడలి పలు గ్రామాల్లో కూరగాయలు తోటలు నీట మునిగి దెబ్బతిన్నాయి. వర్షపునీరు నిలవడంతో పొలాలు చెరువులను తలపిస్తున్నాయి. వర్షాలు ఇంతటితో ఆగకుండా ఇలానే కురిస్తే వరినార్లు పూర్తిగా నీట మునిగి రైతులు ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుంది.

కోటలో తహశీల్దార్ సుడిగాలి పర్యటన

సముద్ర తీర ప్రాంతాల్లో ఉండే కోట మండలంలోని కొత్తపట్నం, గోవిందపల్లి పాలెం, బకింగ్ కెనాల్ సమీపంలో ఉండే జగిత్యాని దిబ్బ, పుచ్చలపల్లి, అంతేకాకుండా ప్రమాదకరంగా ఉండే గ్రామాల్లోని రుద్రవరం, ఊనుగుంటపాలెం, కర్లపూడి, వంజివాక, గూడలి గ్రామాల్లోని పొర్లుకట్టలు యొక్క స్థితిగతులను కోట తహశీల్దార్ కటారి జయ జయ రావు సుడిగాలి పర్యటన చేశారు. మండల సర్వేయర్ గోపిరెడ్డి, వి ఆర్ ఓ శ్రీనివాసులు, నీటిపారుదల శాఖ వర్క్ ఇన్స్పెక్టర్ అబ్దుల్లా ఉన్నారు.

నేడు విద్యాసంస్థలకు సెలవు : కలెక్టర్

తిరుపతి : అక్టోబర్ 16వ తేది బుధవారం తిరుపతి జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థలకు, జూనియర్ కళాశాలలకు సెలవు ప్రకటిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ డా.ఎస్. వెంకటేశ్వర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఉత్తర్వులను సంబంధిత యాజమాన్యాలన్నీ విధిగా పాటించాలని కలెక్టర్ ఆ ప్రకటనలో ఆదేశించారు.

'జూ'లో పటిష్ట ఏర్పాట్లు

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం)

శ్రీ వెంకటేశ్వర జంతుప్రదర్శనశాలలో అల్పపీడనం దృష్ట్యా జూ లోని జంతువుల రక్షణకు పటిష్టమైన ఏర్పాట్లు చేసినట్లు జూ పార్కు క్యూరేటర్ సెల్వం తెలిపారు. గత ఏడాది వర్షాల ప్రభావంతో జూ లోని జంతువుల ఎన్ క్లోజర్ లోకి వర్షపు నీరు వచ్చి కాస్త ఇబ్బంది కలిగించిన మాట వాస్తవమేనని, మళ్లీ ఈ సమస్య పునరావతం కాకుండా డ్రైనేజీ వ్యవస్థను పటిష్టం చేశామని, ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు జంతువుల రక్షణకు తీసుకోవలసిన అన్ని చర్యలను తీసుకున్నామన్నారు. ప్రస్తుతం జూ లోని జంతువులకు ఎటువంటి ఇబ్బందులు లేవన్నారు.

కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు : తహశీల్దార్

డక్కిలి : అత్యవసర పరిస్థితుల్లో సేవలందించేందుకు కంట్రోల్ రూమ్‌లను ఏర్పాటు చేసినట్లు తహశీల్దార్ శ్రీనివాసులు తెలిపారు. మండలంలోని కొత్తపల్లి, పాతనాలపాడు దళితవాడ ,ఎస్టి కాలనీ, నక్కల కాలనీ , యల్లవజ్జపల్లి తదితర గ్రామాల నుండి మండల కేంద్రమైన డక్కిలికి వచ్చే ప్రధాన రోడ్డు బురదమయం కావడంతో ఆయా గ్రామాలనుంచి వివిధ పనులకు నిమిత్తం వచ్చే గ్రామస్తులకు తీవ్ర అసౌకర్యం ఏర్పడింది. ఈదురు గాలులతో కూడిన వర్షం రావడంతో వద్దులు చిన్నారులు చలికి వణికి పోతున్నారు.

తుపాను కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు

తిరుపతి కలెక్టరేట్ 0877-2236007
గూడూరు సబ్‌కలెక్టర్ 8624252807
సూళ్లూరుపేట ఆర్డీవో 8623295345
తిరుపతి ఆర్ డి ఓ 7032157040
శ్రీకాళహస్తి ఆర్ డి ఓ 9966524952

తుపానుల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలు

ప్రజాశక్తి - క్యాంపస్

తుపానుల్లో రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వ్యవసాయ శాఖ శాస్త్రవేత్తలు తెలిపారు. చెట్ల మొదళ్లను నిటారుగా నిలబెట్టడం వల్ల వేరుశనగ కాయలపై నీళ్లు నిలవవు. అలాగే పీకిన వేరుశనగ చెట్లపై టార్పాలిన్ పట్టలు కప్పడం ద్వారా నష్టాన్ని నివారించవచ్చు. నూర్పిడి కాయలు తడవకుండా చూసుకోవాలి. పొలంలో నీరు నిల్వ లేకుండా బోదెలు ఏర్పాటు చేసుకోవాలి.

పశువులు పాకలకే పరిమితం

ప్రజాశక్తి - రామచంద్రాపురం

అల్ప పీడన ప్రభావంతో పశువులు పాకలకే పరిమితమయ్యాయి. గ్రామాల్లో మట్టిరోడ్లన్నీ వర్షపు నీటితో నిల్వ ఉండడంతో మనుష్యులు, పశువులు తిరిగే పరిస్థితి లేదు. సహజంగా పశువులను సమీప ప్రాంతాల్లోని పొలాలకు, అడవులకు తీసుకెళ్లి మేపుతూ ఉంటారు. ప్రస్తుతం పాకలకే పరిమితమై దుర్గంధం వెదజల్లే పరిస్థితి నెలకొంది.

రామచంద్రాపురంలో..

చెంచులక్ష్మి కుటుంబాన్ని ఆదుకుంటాం

ఐటిడిఎ పీవో పరిమళ

ప్రజాశక్తి - డక్కిలి

రాపూరు సిమెంట్ బ్రిక్స్ యజమాని వెంకట సుబ్బారెడ్డి మండలంలోని దందవోలు ఎస్టీ కాలనీకి చెందిన చెంచులక్ష్మి భర్త రవిని నిర్బంధించడంతో, మనస్తాపం చెందిన చెంచులక్ష్మి మూడురోజుల క్రితం ఆత్మహత్య చేసుకుంది. మంగళవారం దందవోలు ఎస్టి కాలనీలో ఐటీడీఏ పీవో పరిమళ, తిరుపతి డిటిడబ్ల్యు సూర్యనారాయణ, డక్కిలి ఎమ్మార్వో మోపూరు శ్రీనివాసులు గిరిజన సంఘ నాయకులుతో కలిసి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ఈ సందర్భంగా వారు ఘటనకు సంబంధించినటువంటి వివరాలను చెంచులక్ష్మి భర్త రవి అలియాస్ దావీద్‌ను అడిగి తెలుసుకున్నారు. దావీదు ఇచ్చిన సమాచారం ఆధారంగా స్టేట్మెంట్‌ను రికార్డ్ చేశారు. ఈ సందర్భంగా రవి, కాలనీ గిరిజనులు మాట్లాడుతూ బట్టి యజమానిపై బాండెడ్ లేబర్ కేసు పెట్టించడంతోపాటు, ప్రభుత్వం తరపునుంచి తమను ఆదుకోవాలని కోరారు. ఈ ఘటనకు సంబంధించి పూర్తి వివరాలను కలెక్టర్‌కు నివేదించి కలెక్టర్ ఆదేశానుసారం బాధిత కుటుంబ సభ్యులను ఆదుకుంటామని ఐటిడిఏ పిఓ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో యానాదుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కేసి పెంచలయ్య, తిరుపతి జిల్లా అధ్యక్షుడు తలపల చెంచు మల్లికార్జున రావు, మహిళ అధ్యక్షురాలు చెంబేటి ఉష, రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ ఇండ్ల మల్లికార్జున, జై భారత్ ఎస్సీ పోరాట వేదిక రాష్ట్ర కార్యదర్శి తలారి నాగరాజు, నవజీవన్ ఆర్గనైజేషన్ తరపున రమేష్ పాల్గొన్నారు.

పెండింగ్ భూసేకరణ పనులు వేగవంతం : కలెక్టర్

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

తిరుపతి జిల్లాలో నడికుడి – శ్రీకాళహస్తి మధ్య రైల్వే లైన్‌కు సంబంధించి, తిరుపతి – కాట్పాడి డబుల్ లైన్ పనులకు సంబందించి భూసేకరణ పనులను వేగవంతం చేయాలని కలెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్ ఆదేశించారు. కేంద్ర ప్రభుత్వ ప్రగతి కార్యక్రమం పనుల పురోగతిపై సిఎం కార్యదర్శి ప్రద్యుమ్న, రైల్వే ఉన్నతాధికారులు, ప్రిన్సిపల్ సెక్రటరీ ఆర్ అండ్ బి కాంత్‌లాల్ దండేలతో కలెక్టర్లు, జేసీలు వర్చువల్ విధానంలో మంగళవారం సమావేశమయ్యారు. నడికుడి – శ్రీకాళహస్తి మధ్య రైల్వేలైన్‌కు సంబంధించిన పెండింగ్ పనుల పురోగతిపై చర్చించారు. పెండింగ్‌లో ఉన్న 182 ఎకరాల డికెటి భూములకు సంబంధించి పెండింగ్‌ప్రాసెస్‌ను త్వరలోనే పూర్తి చేస్తామన్నారు. తిరుపతి జిల్లాలో తిరుపతి నుండి పాకాల రైల్వే ట్రాక్ డబుల్ లైన్ 45 కి.మీ లు చేపట్టడానికి పాకాల, చంద్రగిరి, తిరుపతి రూరల్ పరిధిలో సుమారు 37 ఎకరాల భూసేకరణ చేపట్టడానికి చర్యలు చేపట్టాలని సూచించారు. కలెక్టరేట్ జి – సెక్షన్ డిటి భాస్కర్ పాల్గొన్నారు.

వియత్నాం సదస్సుకు ఆచార్య పేటశ్రీకి ఆహ్వానం

ప్రజాశక్తి - క్యాంపస్

వియత్నాంలోని నేషనల్ యూనివర్సిటీ ఆఫ్ ఆర్ట్స్ ఎడ్యుకేషన్‌లో అక్టోబర్ 21వ తేదీ నుంచి 23వ తేదీ వరకు జరిగే అంతర్జాతీయ సదస్సులో పాల్గొనేందుకు ఎస్వీయూ విశ్రాంత తెలుగు ఆచార్యులు పేట శ్రీనివాసులు రెడ్డికి ఆహ్వానం అందింది. ఈ సందర్భంగా ఈ అంతర్జాతీయ సదస్సులో ఆచార్య పేటశ్రీ "పవిత్ర పుణ్యక్షేత్ర తిరుపతి జానపద కళలు" అనే అంశంపై పరిశోధనా పత్రాన్ని సమర్పించినట్లు తెలిపారు. ఎస్వీయూలోని తెలుగు అధ్యయన శాఖలో విశ్రాంత అధ్యాపకులైన ఆచార్య పేట శ్రీనివాసులు రెడ్డి తిరుపతి కథలు, కొండ కథలు, తిరుపతి గంగ జాతర, తిరుపతి జానపద గేయాలు, కథలు వంటి పలు గ్రంథాలను రచించి ప్రసిద్ధిగాంచారు.

'మానవ అక్రమ రవాణా నిర్మూలన' పోస్టర్ విడుదల

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

మానవ అక్రమ రవాణ నిర్మూలన నిఘా నేత్రాలతో సాధ్యమని జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు తెలిపారు. మంగళవారం అర్బన్ ఎస్పీ కార్యాలయంలో పోస్టర్‌ను ఆవిష్కరించారు. పరివర్తన స్వచ్ఛంద సేవా సంస్థ తిరుపతి వారి ఆధ్వర్యంలో 19న శనివారం వాక్ ఫర్ ఫ్రీడమ్ కార్యక్రమాన్ని ఐటిఐ కాలేజీ నుంచి పద్మావతిపురం వరకు నిర్వహించనున్నారు. తిరుపతి జిల్లా మానవ అక్రమ రవాణా నిర్మూలన కమిటీ కన్వీనర్ పి అమరనాథ్, హెల్పింగ్ హాండ్స్ సొసైటీ కార్యదర్శి ఎన్ దొరస్వామి, కౌన్సిల్ ఫర్ సిటిజన్ రైట్స్ జిల్లా మహిళా అధ్యక్షురాలు గిరిజ, శ్రద్ధ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షురాలు విజయలక్ష్మి, పరివర్తన సేవా సంస్థ టీమ్ మెంబర్స్ కె శేషయ్య, పి అనిల్, ఏం మిథున్ చక్రవర్తి పాల్గొన్నారు.

రుయాలో గుండె జబ్బులు విభాగాన్ని ప్రారంభించాలి

ప్రజాశక్తి -తిరుపతి సిటీ

తిరుపతి పేదల ఆసుపత్రిగా పేరు గడిచిన రుయా ఆసుపత్రిలో గుండె జబ్బుల విభాగాన్ని వెంటనే ప్రారంభించాలని మాజీ కేంద్రమంత్రి డాక్టర్ చింతామోహన్ డిమాండ్ చేశారు. స్థానిక రుయా ఆస్పత్రి వద్ద మంగళవారం కాంగ్రెస్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సామాన్యులకు పెద్దపీట వేస్తామని టీటీడీ ఈవో పదేపదే ప్రకటిస్తున్నారని, సామాన్యులు, పేదలు చికిత్స తీసుకునే రుయా ఆసుపత్రిలో గుండె జబ్బుల విభాగాన్ని పునరుద్ధరించకపోవడం శోచనీయమన్నారు. నెలలోపు గుండె జబ్బుల విభాగాన్ని పునరుద్ధరించకపోతే కాంగ్రెస్ ఆధ్వర్యంలో పోరాటాన్ని ఉధతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు యార్లపల్లి గోపి, తేజవతి, శోభ పాల్గొన్నారు.

చింతామోహన్ ఆధ్వర్యంలో రుయా ఎదుట నిరసన

రోటరీ క్లబ్ సేవా కార్యక్రమాలు

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి

రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో మంగళవారం పెద్ద ఎత్తున సేవా కార్యక్రమాలు నిర్వహించారు. రోటరీ క్లబ్ జిల్లా గవర్నర్ సతీష్ మాధవన్, అధ్యక్షురాలు శైలజ, కార్యదర్శి సిద్ధులుగారి ప్రసాద్ ఆధ్వర్యంలో ముందుగా బాల బాలికల యువత కార్యకలాపాల పోటీల్లో విజేతలైన వారికి మెరిట్ సర్టిఫికెట్లు, మెమెంటోలు, బహుమతులు అందజేశారు. భరద్వాజ వద్ధాశ్రమానికి ఒక వీల్ చైర్, నెబులైజర్ ను అందించారు. ఊరందూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పనిచేస్తూ జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును అందుకున్న కే.సురేష్ ను రోటరీ ఒకేషనల్ ఎక్సలెన్సీ అవార్డుతో సత్కరించారు. అనంతరం రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో గతంలో చేసిన వివిధ సేవా కార్యక్రమాలను గుర్తించి 'సర్టిఫికేట్ ఆఫ్ ఎక్సలెన్సీ' అవార్డును అందజేశారు.

కలాం నిత్య స్ఫూర్తి

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి

కలలు కనడం కాదు..వాటిని సాకారం చేసుకోవాలన్న విద్యార్థులకు భారత మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం నిత్య స్ఫూర్తి అని స్కిమ్స్ కరెస్పాండంట్ మిద్దెల హరి అన్నారు. స్థానిక స్కిమ్స్ బీ-స్కూల్లో మంగళవారం అబ్దుల్ కలాం 93వ జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా కలాం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. మిద్దెల హరి మాట్లాడుతూ కలాం విద్యార్థుల సాధికారతను పెంపొందించడానికి కషి చేశాడని కొనియాడారు. తన చివరి దశలో షిల్లాంగ్ లో బోధన చేస్తూ మరణించారని గుర్తు చేశారు. ప్రిన్సిపాల్ గీతా దేవి, డైరెక్టర్ కుమార్ పాల్గొన్నారు.

యోగానంద విద్యాసంస్థల ఛైర్మన్‌కు ఏడాది జైలు శిక్ష

ప్రజాశక్తి - రేణిగుంట (తిరుపతి జిల్లా)

చెక్‌బౌన్స్ కేసులో రేణిగుంటలోని ప్రముఖ యోగానంద విద్యాసంస్థల ఛైర్మన్ డి.మోహన్‌రెడ్డికి ఏడాది జైలుశిక్షతో పాటు, తీసుకున్న రూ.14 లక్షలు చెల్లించాలని గురువారం తిరుపతి ఫస్ట్ ఎడిఎం కోర్టు జడ్జి సత్యకాంత్ తీర్పు వెల్లడించారు. ఫిర్యాదుదారుడైన రెడ్డివారి వెంకట సుబ్బారెడ్డి వద్ద 2018 నవంబర్ 16న డి.మోహన్‌రెడ్డి డబ్బు తీసుకుని చెక్ ఇచ్చారు. అయితే డి.మోహన్‌రెడ్డి ఇచ్చిన చెక్ బౌన్స్ కావడంతో ఫిర్యాదుదారుడు కోర్టును ఆశ్రయించారు. కోర్టు విచారణ అనంతరం నిందితుడు డి.మోహన్‌రెడ్డికి శిక్ష ఖరారయ్యింది. ఫిర్యాదుదారు తరపున ఎన్.శ్రీనివాసరావు, సి.శంకర్‌రెడ్డి వాదించారు.

సా..గుతున్న సాగర'మాల'

సిక్స్‌లైన్ రోడ్డు నిర్మాణ పనులు జాప్యం
కృష్ణపట్నం పోర్టుతో అనుసంధానం
నష్టపరిహారం రూ.6 కోట్లు పెండింగ్

ప్రజాశక్తి - కోట

సాగరమాల సిక్స్‌లైన్ రోడ్డు నిర్మాణ పనుల్లో జాప్యం కొన'సాగుతోంది'... బాధితుల నష్టపరిహారం 163 ఎకరాలకు 27 కోట్ల రూపాయలు ఇవ్వాల్సి ఉండగా ఇప్పటివరకూ 21 కోట్లు మాత్రమే ఇచ్చారు. 20 హెక్టార్లకు ఐదు కోట్ల 60 లక్షల రూపాయలు పెండింగ్ ఉందని సమాచారం. కోట మండల పరిధిలో రెండు సంవత్సరాల ప్రాజెక్టు అని చెబుతున్నారు. అయితే ఇప్పటికే ఏడాది పూర్తయ్యింది. నిధుల లేమి వల్లనే పనుల్లో జాప్యం జరుగుతోందని సమాచారం. 30కిలోమీటర్ల పరిధిలో ఈ రహదారిని నిర్మించేలా అంచనాలు వేసి పనులు ప్రారంభించారు.

కొత్తపాలెం గ్రామం వద్ద ఫ్లై ఓవర్ బ్రిడ్జి నిర్మాణం

కోట మండలంలో సాగరమాల రోడ్డు నిర్మాణానికి పనులను ప్రారంభించారు. చిల్లకూరు మండలంలోని తూర్పు కనుపూరు, వేళ్లపాలెం గ్రామాలతో కలిసి కోట మండలంలోని రుద్రవరం, కర్లపూడి, ఉత్తమ నెల్లూరు, తూర్పు కనుపూరు, అగ్రహారం, నెల్లూరుపల్లి, సిద్దవరం, కొత్తపాలెం, చెందోడు కూడలి గ్రామాల్లో రైతుల భూములను సాగరమాల రోడ్డు నిర్మాణానికి సర్వేలో కేటాయించారు. మొత్తం 163 ఎకరాల భూమిని తీసుకోగా, నష్టపరిహారంగా రైతులకు రూ.27 కోట్లు వెచ్చించారు. రెండేళ్ల ప్రాజెక్టు అని చెబుతున్నా ఎప్పటికి పూర్తవుతుందన్నది అనుమానమే. ఇటీవల సాగరమాల ప్రాజెక్టు పనులు చురుగ్గా జరుగుతున్నాయి. ఇదేగనుక చెప్పిన సమయానికి పూర్తయితే చెన్నయ్, బెంగుళూరు, తిరుపతి పట్టణాలకు వెళ్లాలంటే సాగరమాల రోడ్డుతో ప్రయాణం సులువవుతుంది. రియల్టర్లు, సాఫ్ట్‌వేర్లు ఇప్పటికే ఈ ప్రాంతాల్లో వ్యాపారాలు చేసుకోడానికి భూములు కొనుగోలు చేశారని చర్చ నడుస్తోంది. ప్రస్తుతం రోడ్డు పక్కనే ఎకరా 45 లక్షల నుంచి 50 లక్షలు ధర పలుకుతుందని విద్యానగర్ రైతులు చెబుతున్నారు. తిరుపతి – బెంగళూరు– చెన్నై నుండి కష్ణపట్నం పోర్టు సుమారు 30 నుంచి 40 కిలోమీటర్ల దూరం ఉంటుంది. అక్కడక్కడ ఫ్లై ఓవర్ బ్రిడ్జిలు శరవేగంగా నిర్మిస్తున్నారు.


విద్యానగర్ సమీపంలో ఇనప రాడ్లతో సిద్ధంగా ఉన్న దృశ్యం

సర్వీస్ రోడ్డుతో ఉపయోగం

కోట మండలంలోని 21 పంచాయతీలు, వాకాడు మండలంలోని 19 పంచాయితీలు అదేవిధంగా చిల్లకూరు, చిట్టమూరు మండల ప్రజలు అందరూ నిరంతరం గూడూరు– దుగరాజపట్నం– నెల్లూరు– చెన్నై– తిరుపతి, బెంగుళూరు తదితర పట్టణాలకు నిరంతరం రాకపోకలకు ప్రయాణం చేస్తుంటారు. వారికి ఈ సిక్స్‌లైన్ రోడ్డు నిర్మాణం పూర్తయితే ఉపయోగకరంగా ఉంటుంది. అన్ని రోడ్లు కలిసే కూడలి మార్గం చెందోడు (విద్యానగర్) కొద్దిదూరంలోనే వే బ్రిడ్జిని నిర్మిస్తున్నారు. ఈ ప్రదేశంలో సర్వీసు రోడ్డు నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు. కొత్తపట్నం పంచాయతీ పరిధిలో క్రిష్‌సిటీ కంపెనీ రానుందని సమాచారం. ఇది శ్రీసిటీలా ఉండబోతుందని చెబుతున్నారు. అదేవిధంగా పలు పరిశ్రమల ఏర్పాటుతో స్థానికులకు ఉద్యోగాలు లభిస్తాయని స్థానికులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. సర్వీస్ రోడ్లు తూర్పు కనుపూరు, విద్యానగర్ బాంబ్‌బ్లాస్ట్ సమీపంలో బ్రిడ్జి నిర్మించే చోట, నాయుడుపేట వద్ద ఏర్పాటు చేస్తున్నారని సాగరమాల అధికారులు చెబుతున్నారు. సాగరమాల రోడ్డు పూర్తయితే తమ భూములు 40–50 లక్షల రూపాయలు ధర పలుకుతుందని చెందోడు గ్రామానికి చెందిన రైతు కె.కోటేశ్వరరావు తెలిపారు. పరిశ్రమలు వస్తే నిరుద్యోగులకు ఉపయోగమని చెందోడుకు చెందిన మల్లి, చంద్రశేఖర్ పేర్కొన్నారు. నాయుడుపేట, చెన్నయ్, తిరుపతి, బెంగుళూరు పట్టణాలకు వెళ్లాలంటే తక్కువ సమయం, తక్కువ ఇంధనంతో వెళ్లవచ్చని టిడిపి నాయకులు చల్లా శ్రీనివాసులు తెలిపారు. కేంద్ర ప్రభుత్వ స్కీంలో 2035 నాటికి 839 ప్రాజెక్టులు పూర్తి చేయాల్సి ఉంది. సాగరమాల మొత్తం బడ్జెట్ దాదాపు రూ.5.8 లక్షల కోట్లుగా అంచనా వేసినట్లు పేర్కొన్నారు.

'రైతులు ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారించాలి'

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : రైతులు ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారించాలని గూడూరు మండల వ్యవసాయ అధికారి వి రమేష్ పేర్కొన్నారు. 'పొలం పిలుస్తోంది' కార్యక్రమాన్ని గూడూరు మండల పరిధిలోని కొమ్మ నేటూరు, కందలి గ్రామాలలో ముంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గూడూరు మండల వ్యవసాయ అధికారి వి రమేష్ మాట్లాడుతూ రబీ పంటల సాగు యాక్షన్ ప్లాన్ ను తెలిపారు. ఈ రబీ 2024-25 కి సంబంధించి రైతు సేవా కేంద్రాల వారీగా విత్తనాల ఆవశ్యకతను పంపిచామని, విత్తనాల వచ్చిన వెంటనే బయోమెట్రిక్ పద్ధతిలో రైతులకు సరఫరా చేస్తామన్నారు. రైతులు ప్రకృతి వ్యవసాయం వైపు దృష్టి సారించాలని కోరారు. ప్రకృతి వ్యవసాయంతో తక్కువ పెట్టుబడితో అధిక ఉత్పత్తి, నికర ఆదాయం పెంపొందించుకోవాలని సూచించారు. ద్రవ జీవామృతాల తయారీ, వాటి ఉపయోగాలను రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో పశు వైద్యుడు ప్రభాకర్, కొమ్మనేటూరు , కందలి గ్రామ నాయకులు , వ్యవసాయ సహాయకులు కె ప్రసన్న , కస్తూరయ్య , తిరుమల , యస్ పెంచలయ్య , రైతులు పాల్గొన్నారు.

బుచ్చిరాయుడు కండ్రిగ: బుచ్చినాయుడు కండ్రిగ మండలంలోని వెస్ట్ వరత్తూరు, తలారివెట్టు గ్రామాల్లో మంగళవారం 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వ్యవసాయ అధికారిణి భారతి మాట్లాడుతూ వరిలో కలుపు నివారణకి (ప్రీ ఎమర్జెన్సీగా) నాటిన మూడు రోజుల్లోం పెటిలక్లోరో 500 మిల్లీ గ్రాములు, పైరిజు సెల్ఫీరాన్ ఎత్తెల్ 120 మందును 20 కిలోల ఇసుకలో కలిపి ఒక ఎకరా వరి పొలంలో నీళ్లు పెట్టి చల్లుకోవాలని సూచించారు. మందు చల్లిన తరువాత 24 గంటల వరకు నీళ్లు తీయడం కాని, నీళ్లు పెట్టడం కాని వరి పొలంలో చేయకూడదన్నారు. వరి పొలంలో కలుపు ఉన్న ఎడల వరి నాటిన 25 రోజుల లోపల లేక కలుపు మొక్క రెండాకు దశలోపల ఉండేటప్పుడు పోస్ట్ ఎమర్జెన్సీ కలుపు ముందుని వాడుకొని కలుపు నివారణ చేసుకోవచ్చన్నారు. పోస్ట్ ఎమర్జెన్సీ కలుపుమందు కౌన్సిల్ ఆక్టివ్ 90 గ్రాములు, లేక నామినీ గోల్డ్ 90 మిల్లీ గ్రాములు ఒక ఎకరాకి 10 నుంచి 15 కేజీల యూరియాతో కలిపి పొలంలో చల్లుకున్న తర్వాత కలుపు నివారణ అవుతుందన్నారు. హార్టికల్చర్ అధికారిణి యామిని మాట్లాడుతూ రైతులందరికీ 90 శాతం సబ్సిడీతో డ్రిప్, స్ప్రింక్లర్, మినీ స్ప్రింక్లర్ రైతులకి ఇవ్వడానికి సిద్ధంగా వున్నామని తెలిపారు. కావాల్సిన రైతులు రైతు భరోసా కేంద్రంలో వ్యవసాయ సిబ్బందిని అడిగి రిజిస్ట్రేషన్ చేసుకోవాలని కోరారు. డ్రిప్ ఇరిగేషన్ ఏర్పాటు చేసుకుంటే కలుపు, దిగుబడి అధికంగా వస్తుందని సూచించారు. పశు సంవర్ధక శాఖ అధికారి డాక్టర్ ముని రాజా మాట్లాడుతూ మీకు గడ్డి కత్తిరించే యంత్రం, ఏదైనా పశువులకి ఈ వర్షం వల్ల ప్రాబ్లం ఉంటే వెంటనే తమను సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది భరత్, రేవతి, పశు వైద్య సిబ్బంది, రైతులు,టిడిపి మండలం నాయకులు, రైతులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వృద్ధాశ్రమంలో అన్నదానం

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : కృప సేవా చారిటబుల్ ట్రస్ట్ జాయింట్ సెక్రెటరీ అత్తి మంజరి గోపాల్ పుట్టినరోజు సందర్భంగా గూడూరు పట్టణంలోని ఓం సాయిరాం చారిటబుల్ ట్రస్ట్ వృద్ధాశ్రమంలో కృప సేవ చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు, కుటుంబ సభ్యుల నడుమ పుట్టినరోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు.

వృద్ధాశ్రమంలో అన్నదానం నిర్వహిస్తున్న దాతలు

అనంతరం అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి దాతలుగా అత్తి మంజరి గోపాల్, భార్య మల్లేశ్వరి దంపతులు వ్యవహరించారు. ఈ సందర్భంగా గోపాల్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సేవా దక్పథం అలవరచు కోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కృప సేవ చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షులు కటకం శ్రీనివాసులు,సెక్రటరీ పెరిమిటి చెంచయ్య, పర్వతాల రమేష్, కృప సేవ చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు సురేంద్రబాబు, ఎస్కె రఫీ ఓం సాయిరాం చారిటీస్ నిర్వాహకురాలు కళ్యాణి పాల్గొన్నారు.

అందుబాటులో ఇసుజు డి-మ్యాక్స్ అంబులెన్స్

ప్రజాశక్తి -తిరుపతి సిటీ

ఇసుజు మోటార్స్ ఇండియా ఏఐఎస్ -125 టైప్ సి అంబులెన్స్ నిర్దేశనలతో పూర్తిగా-నిర్మించబడిన ఇసుజు డి - మ్యాక్స్ అంబులెన్స్‌ను మార్కెట్లోకి విడుదల చేసినట్లు ఆ సంస్థ డిప్యూటీ మేనేజింగ్ డైరెక్టర్ తోరు కిషిమటొ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ పట్టణ, గ్రామీణ ప్రాంతాల రహదారులకు అనుగుణంగా తమ కొత్త అంబులెన్స్ ఏర్పాటు చేశామన్నారు. ఇందులో సరికొత్త పరిజ్ఞానంతో కూడిన పరికరాలతో పాటు రోగికి అవసరమైన సరికొత్త సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన సౌకర్యాలు ఏర్పాటు చేశామని తెలిపారు. దీనిని రోగులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మరింత సమాచారం కోసం వినియోగదారుడు 1800 4199 188 (టోల్ ఫ్రీ) ను సంప్రదించాలని కోరారు.

శాంతి భద్రతలకు విఘాతం కల్గిస్తే ఉపేక్షించేది లేదు

గూడూరు డిఎస్పీ రమణ కుమార్

ప్రజాశక్తి - గూడూరు టౌన్: శాంతి భద్రతలకు విఘాతం కల్గిస్తే ఉపేక్షించేది లేదని గూడూరు డిఎస్పీ రమణ కుమార్ పేర్కొన్నారు. గూడూరు డిఎస్పీ రమణ కుమార్ గూడూరు టూటౌన్ పోలీస్ స్టేషన్లో విలేకరుల సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల గూడూరు రెండో పట్టణంలో ఇద్దరు బాలుర మధ్య వివాదం, దాడి ఘటన చోటుచేసుకున్నాయన్నారు. బాలుడు ఫిర్యాదు మేరకు దాడికి పాల్పడిన బాలురులపై విచారణ చేపడతామన్నారు. యువత చెడు దారులు పట్టకుండా మంచి పౌరులుగా ఎదగాలని సూచించారు. ఈ సమావేశంలో గూడూరు పట్టణ సీఐలు శేఖర్ బాబు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న డిఎస్పి రమణకుమార్

సింగర్ కార్తీక్ లైవ్ షోకు ఉచితంగా అనుమతించాలి

ఎస్వియూ విసికి విద్యార్థి నాయకుల వినతి

ప్రజాశక్తి - క్యాంపస్ : శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయంలో సింగర్ కార్తీక్ లైవ్ షోకి ఎస్వియూ విద్యార్థులకు ఉచితంగా అనుమతించాలని వైఎస్ఆర్ విద్యార్థి విభాగం వర్సిటీ అధ్యక్షులు మన్నం ప్రేమ్ కుమార్ అధ్యక్షులు యుగంధర్ ఆధ్వర్యంలో వీసీ ఆచార్య అప్పారావుకు మంగళవారం వినతిపత్రం ఇచ్చారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అక్టోబర్ 26న సింగర్ కార్తీక్ మ్యూజిక్ లైవ్ షో ఎంట్రీ ఫీజులు రూ.699 నుంచి 7,499 రూపాయలు వరకు అత్యధిక ధరలకు టికెట్లను నిర్ణయించి విద్యార్థుల నుంచి డబ్బులు దోచుకోవడం దారుణం అన్నారు. విద్యార్థులకు ఉచితంగా ఈ లైవ్ షో తిలకించేలా అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. లకుంటే ఈ లైవ్ షో ఈవెంట్ పర్మిషన్‌ను తక్షణమే రద్దు చేయాలని కోరారు. అలా లేకుంటే ఈ లైవ్ షో ఈవెంట్ కు పర్మిషన్ రద్దు అయ్యే వరకు పెద్ద ఎత్తున యూనివర్సిటీ విద్యార్థులతో కలిసి ఈవెంట్‌ను అడ్డుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి సంఘాలు నాయకులు రూకేష్, ముని, నరేష్, లిఖిత్, మురళి , దినేష్, మునీంద్ర, బాలాజీ, సాయి పాల్గొన్నారు.

ఎస్వియు విసికి వినతిపత్రం అందిస్తున్న వైఎస్ఆర్ విద్యార్థి విభాగం నాయకులు

గ్రామీణ ప్రాంతాలకు మహర్దశ

-రాష్ట్ర పద్మశాలి కార్పొరేషన్ డైరెక్టర్ గంజి మాధవయ్య

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : రాష్ట్రంలో ఎన్డీయే కూటమి ప్రభుత్వంతో గ్రామీణ ప్రాంతాలకు మహర్దశ పడుతోందని రాష్ట్ర పద్మశాలి కార్పొరేషన్ డైరెక్టర్ గంజి మాధవయ్య పేర్కొన్నారు. పుత్తూరు రూరల్ మండలం తడుకు గ్రామ పంచాయతీకి ఎమ్మెల్యే గాలి భాను ప్రకాష్ మంజూరు చేయించిన నిధులు రూ.40 లక్షలలో భాగంగా వేణు గోపాలపురంలో రూ.4.50 లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డు, డ్రైనేజి పనులకు మంగళవారం ఆయన భూమిపూజ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆర్డబ్ల్యూఎస్ ఏఈ అంజేరయ్య, ఉపాధి హామీ ఏపీఓ భార్గవి, తడుకు సర్పంచ్ పాశం వెంకటేష్, పుత్తూరు రూరల్ మండల ప్రధాన కార్యదర్శి ఏ బాలాజీ, మండల మాజీ అధ్యక్షుడు కరుణా యాదవ్, మాజీ ఎంపిటీసీలు ఆదిమందడి, కోట గజపతి, ప్రభుత్వ అధికారులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

తడుకులో రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన నిర్వహిస్తున్న గంజి మాధవయ్య

తిరుపతి డెస్క్: సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం పల్లె పండుగను మంగళవారం నారాయణవనంలో ఘనంగా ప్రారంభించారు. నారాయణవనం మేజర్ పంచాయతీ కసింమిట్టకు వెళ్లే మార్గంలోని సందు వీధిలో సిసి రోడ్డు నిర్మాణానికి భూమి పూజ చేశారు. సుమారు 8 లక్షల రూపాయల వ్యయంతో 200 మీటర్ల మేర ఈ సిసి రోడ్డును నిర్మించనున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీరాజ్ డిఇ ఉమా శంకర్, ఎంపీడీవో గుణశేఖర్, తహశీల్దారు ఈవో పిఆర్డి డాక్టర్ వేనయ్య, ఎన్ఆర్ఈజీఎస్ ఏపీవో సుకన్య, వెలుగు ఏపిఎం మమత, నారాయణవనం పంచాయతీ ఈవో కెపి షణ్ముగం, స్థానిక టిడిపి నాయకులు పి గోవిందస్వామి, టీ ఊరప్ప, గోవింద శెట్టి, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

దొరవారిసత్రం : మండల పరిధిలో కొత్తపల్లి,కల్లూరు, నెల్లూరుపల్లి, గ్రామాల్లో మంగళవారం పల్లె పండుగను నిర్వహిం చారు. రూ.పది లక్షలు, కొత్తపల్లిలో రూ.8 లక్షలు, నెల్లూరు పల్లిలో రూ.5 లక్షల నిధులతో సీసీ రోడ్ల నిర్మాణాలకు అధికారు లు, నాయకులు భూమి పూజ నిర్వహిం చారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో గోవర్ధన్, మండల ఏఈ, కార్యదర్శి, స్థానిక పార్టీ నాయకులు మాజీ జెడ్పిటిసి ఇట్టగుంట రత్నయ్య, సర్పంచ్‌లు పురుషోత్తం, నాగూరయ్య, టిడిపి మండల నాయకులు కిషోర్ నాయుడు, రవీంద్ర నాయుడు, బిజెపి మండల అధ్యక్షులు చింతకాని వెంకటరమణయ్య నాయుడు పాల్గొన్నారు.

తిరుపతి డెస్క్: గ్రామ పంచాయతీల పున రుద్ధీకరణ పల్లె పండుగ వారోత్సవాల్లో భాగం గా మంగళవారం ఏర్పేడు మండలంలోని కుక్కల గుంట, పెనుమల్లం, పెనుగడ్డం పంచాయతీలలో సిమెంట్ రోడ్లు, సిమెంట్ కాలువలు నిర్మాణానికి మంగళ వారం భూమి పూజ చేపట్టారు. ఈ కార్యక్రమంలో అధికారులు, టిడిపి నాయకు లు, గ్రామ సర్పంచులు, సచివాలయం సిబ్బంది, ఉపాధి సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

రామచంద్రాపురం (పాకాల): గ్రామీణ ప్రాంతాలలోని గ్రామాల అభివృద్దే ప్రధాన లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పని చేస్తోందని చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి వెంకట మణి ప్రసాద్ (నాని) అన్నారు. మంగళవారం చంద్రగిరి నియోజకవర్గంలోని పాకాల, దామలచెరువు పంచాయతీలలోని పోలిశెట్టి వారి పల్లి, రాజీవ్ కాలనీ గ్రామాలలో పల్లె పండుగలో భాగంగా పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు, భూమి పూజలు, ప్రారంభోత్సవాలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండు కోట్ల అరవై ఐదు లక్షల రూపాయలతో పాకాల, దామలచెరువు గ్రామ పంచాయతీలలోని 28 హ్యాబిటేషన్లలో అభివృద్ధి పనులు చేపడుతున్నామని తెలిపారు. అందరం కలిసికట్టుగా గ్రామాల అభివృద్ధికి కృషి చేద్దామని ఆయన ప్రజలకు పిలుపునిచ్చారు. ప్రజా సమస్యలు వుంటే తమ దృష్టికి తెస్తే పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జెడ్పిటిసి నంగా పద్మజా రెడ్డి, ఎంపీడీవో శశిరేఖ, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ నవీన్, పంచాయతీ కార్యదర్శి కేతన్ కుమార్, ఎన్డీఏ కూటమి నాయకులు అధికారులు పాల్గొన్నారు.

అభివృద్ధి కార్యక్రమాల శిలాఫలకాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే నాని

క్రైం న్యూస్

తిరుమల ఘాట్‌లో ప్రమాదం

ఐదుగురికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి -తిరుమల: తిరుమల మొదటి ఘాట్ రోడ్డులో మంగళవారం చోటు చేసుకున్న ప్రమాదంలో డ్రైవర్ కు తీవ్ర గాయాలయ్యాయి. నలుగురు భక్తులు స్వల్పంగా గాయపడ్డారు. ఒకటవ మలుపు వద్ద టెంపో అదుపు తప్పి రోడ్డు డివైడర్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో టెంపోలోని డ్రైవర్ తలకు తీవ్ర గాయాలయ్యాయి. నలుగురు తిరుమల భక్తులకు స్వల్ప గాయాలయ్యాయి. ఘటనా స్థలానికి పోలీసులు చేరుకుని గాయపడిన వారిని ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పిజి స్పాట్ అడ్మిషన్ల గడువు పొడిగింపు

ప్రజాశక్తి - క్యాంపస్: శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయంలో ఎంఏ, ఎంకామ్, ఎంఎస్సీ కోర్సుల్లో ఖాళీగా ఉన్న సీట్లకు స్పాట్ అడ్మిషన్ల గడువు తేదీలను అక్టోబర్ 21 వ తేదీ వరకు పొడిగిస్తున్నట్లు ఎస్వీయూ రిజిస్ట్రార్ ఆచార్య భూపతి నాయుడు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉన్నత విద్యామండలి ఆదేశాల ప్రకారం ఎస్వీయూలోని, డైరెక్టరేట్ ఆఫ్ అడ్మిషన్ల కార్యాలయంలో ఈ నెల 14వ తేదీ నుంచి 21వ తేదీ మధ్యలో ఎస్వీయూ పిజి సెట్ 2024లో ర్యాంకు పొందిన విద్యార్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరై సీటు పొందవచ్చన్నారు. మరిన్ని వివరాలకు డిఓఏ డైరెక్టర్ ఆచార్య రమేష్ బాబును (0877-2248589) ఫోను నెంబరుకు సంప్రదించాలని తెలిపారు.

రైతులే మూలాధారం: సర్పంచ్

ప్రజాశక్తి -రేణిగుంట: గ్రామ పంచాయతీలకు రైతులే మూలాధారమని సర్పంచ్ లక్ష్మీపతి రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం గ్రామ పంచాయతీ ఈ క్రాప్ నమోదు గ్రామసభ నిర్వహించారు. ఈ గ్రామసభలో గ్రామ ప్రజలు చేసిన పంట నమోదు విషయాలను రైతులు చేసిన పంటల గురించి ప్రజలకు అగ్రికల్చర్ ఆఫీసర్ రవి ప్రసాద్ వివరించారు. సుమారు 46 ఎకరాలు పంట ఈ క్రాప్ చేశామని 46 మంది రైతులు భాగస్వామ్యులయ్యారని తెలిపారు. ఇంకా ఎవరైనా ఉన్నా నమోదుకు సిద్ధంగా ఉన్నామని, ప్రతి ఒక్క రైతు ఈ క్రాప్ నమోదు చేసుకోవాలన్నారు. సర్పంచ్ రెడ్డి మాట్లాడుతూ ఈ క్రాపింగ్ నమోదు చేసుకోవడం వల్ల రైతులకు రావాల్సిన రైతు భరోసా, ఏదైనా అత్యవసర పరిస్థితుల్లో పంట నష్టపోయినా, వర్షాలకు పంట పోయినా పంట కొనుగోలు చేసేందుకు ఈ క్రాప్ నమోదు చాలా ముఖ్యమన్నారు. ఈ క్రాప్ నమోదు చేసుకుంటే ప్రభుత్వం నుంచి వచ్చే అన్ని పథకాలు వస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ రైతులు, సచివాలయ సెక్రెటరీ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

టొయోటా కిర్లోస్కర్ ఫెస్టివల్ లిమిటెడ్ పరిచయం

ప్రజాశక్తి -తిరుపతి సిటీ: టొయోటా కిర్లోస్కర్ మోటార్ (టికెఎం) అర్బన్ క్రూయిజర్ హైరైడర్ 'ఫెస్టివల్ లిమిటెడ్ ఎడిషన్'ని పరిచయం చేసినట్లు బిజినెస్ వైస్ ప్రెసిడెంట్ శబరి మనోహర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ "2022లో విడుదల చేసినప్పటి నుండి, అర్బన్ క్రూయిజర్ హైరైడర్ స్థిరమైన మొబిలిటీని అందించడంలో టికెఎం నిబద్ధత చిహ్నంగా ఉందన్నారు. ఈ ప్రత్యేక ఆవిష్కరణలో భాగంగా, 31 అక్టోబర్ 2024 వరకు భారతదేశంలోని డీలర్‌షిప్‌లలో అందుబాటులో ఉన్న అర్బన్ క్రూయిజర్ హైరైడర్ ఫెస్టివల్ లిమిటెడ్ ఎడిషన్‌ను ఎంచుకునే కస్టమర్ల కోసం రూ. 50,817 విలువైన కాంప్లిమెంటరీ ప్యాకేజీని టికెఎం అందిస్తోంది. దీనిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వర్షపు నీరు నిల్వ లేకుండా చూసుకోవాలి

- సర్పంచ్ మోహన్ ప్రియ

ప్రజాశక్తి -తిరుపతి డెస్క్: వర్షపు నీరు నిల్వ లేకుండా చూసుకోవాలని సర్పంచ్ మోహనప్రియ సూచించారు. ఏర్పేడు మండలం ఎండి పుత్తూరులో సర్పంచ్ మోహనప్రియ, టిడిపి నాయకులు, సచివాలయ సిబ్బందితో కలిసి తుఫాన్ కారణంగా ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాలకు ప్రజలకు ఏమైనా సమస్యలు ఉన్నాయా?' అని తెలుసుకునేందుకు గ్రామమంతా తిరిగి కొన్నిచోట్ల వీధుల్లో నిలువ ఉన్న నీటిని తొలగించారు. ఈ సందర్భంగా ఆమెమాట్లాడుతూ మీ ముంగిట్లో ఎలాంటి వర్షపు నిల్వ నీరు లేకుండా జాగ్రత్త పడాలని గ్రామస్థులకు దిశా నిర్దేశం చేశారు. ఏమైనా ఇబ్బందులు తలెత్తితే వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని కోరారు.

అభ్యాస వైకల్యాలపై అవగాహన

ప్రజాశక్తి- బుచ్చినాయుడుకండ్రిగ: మండలం కేంద్రం ఆవరణలోని భవితస్కూలు విద్యార్థులకు నిర్దిష్ట అభ్యాస వైకల్యాలపై మంగళవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. చదువులో వెనకబడిన విద్యార్థులను స్పెషల్ శిక్షణ ద్వారా సరిదిద్దవచ్చని తెలిపారు. భాషణ వైకల్యం, పఠన వైకల్యం, లేఖన వైక్యలం, గణితపరమైన వైకల్యం వల్ల వచ్చే ఈ సమస్యను శిక్షణ ద్వారా సరిచేయవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఉమా మహేశ్వరీ, భవిత సెంటర్ ఉపాధ్యాయులు, అయ్యప్ప రెడ్డి , పి నయోమి, విద్యార్థుల తల్లి దండ్రులు, భవిత సెంటర్ విద్యార్థులు, ప్రాథమిక పాఠశాల విద్యార్థినివిద్యార్థులు, పాల్గొన్నారు.

బిఎన్ కండ్రిగలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

రామచంద్రాపురం: విద్యార్థులలో అభ్యాసన సామర్థ్యాన్ని పెంపొం దించు కోవడానికి నిర్దిష్ట అభ్యసన వైకల్య శిక్షణ ఎంతగానో ఉపయోగపడుతుందని ఎంఈవో మార్కండేయ నాయుడు అన్నారు. మంగళవారం కమ్మ కండ్రిగలోని చేకూరి నాగమ నాయుడు, ఎర్రమ్మల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్దిష్ట అభ్యసన వైకల్య జాగృతిపై అవగాహన ర్యాలీ నిర్వహిం చారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ చదువులో వెనక బడిన విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ్ ద్వారా అభివృద్ధి సాధిం చడానికి వీలుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రత్యేక ఉపాధ్యాయు రాలు లీలారాణి, భవిత పాఠశాల ఉపాధ్యాయులు మనోహర్, రాజేశ్వరి, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తిరుపతి డెస్క్: ఎంపీపీఎస్ నారాయణవనం మెయిన్ స్కూల్ ఆవరణలోని భవిత సెంటర్ విద్యార్థులకు సంబంధించి నిర్దిష్ట అభ్యసన వైకల్యాలుపై మంగళవారం అవగాహన ర్యాలీని ఎంఈవో ప్రభాకర్ రాజు హాజరై ర్యాలీని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో భవిత సెంటర్ విద్యార్థులు, ఎంపీపీ ఎస్ నారాయణవనం మెయిన్ పాఠశాల విద్యార్థిని విద్యార్థులు ర్యాలీలో పాల్గొన్నారు. ఎంపీపీఎస్ నారాయణవనం మెయిన్ స్కూల్ ప్రధానోపాధ్యాయులు రోసి మందడి , భవిత సెంటర్ ఉపాధ్యాయులు, పి విజయన్, బి భరత్, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

తిరుపతి టౌన్: స్థానిక బైరాగి పట్టెడ లోని మహాత్మా గాంధీ మున్సిపల్ హైస్కూల్ ఆవరణలోని భవిత సెంటర్ విద్యార్థులకు అభ్యాస వైకల్యాలపై ఈ సహిత విద్య సమన్వయకర్త, ముఖ్య అతిథి డి చంద్రశేఖర్ రెడ్డి మంగళవారం ర్యాలీ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో భవిత సెంటర్ విద్యార్థులు, మహాత్మా గాంధీ మున్సిపల్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు కదిరి రవి, భవిత సెంటర్ ఉపాధ్యా యులు, కే భవాని , బి జ్ఞానమ్మ, ఎంజీఎం పాఠశాల ఉపాధ్యాయు లు బండి మధుసూదన్ రెడ్డి, బండి యామిని, కే హరికృష్ణబాబు , విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

పుత్తూరు టౌన్ : పుత్తూరు ఎంపీపీఎస్ మెయిన్ స్కూల్ ఆవరణలోని భవిత సెంటర్ విద్యార్థులకు మంగళవారం నిర్దిష్ట అభ్యాస వైకల్యాలపై అవగాహన ర్యాలీని ఎంఈవోలు తిరుమల రాజు, బాలసుబ్రహ్మణ్యం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు మురళీకృష్ణ, భవిత సెంటర్ టీచర్లు సూర్యకుమారి. పి ఆనంద్, స్పెషల్ టీచర్లు జగదీశ్వర్, విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

రామచంద్రాపురం (చంద్రగిరి): నిర్దిష్ట అభ్యాస వైకల్యాలపై భవిత సెంటర్ ఆధ్వర్యంలో మంగళవారం అవగాహనా ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా విచ్చేసిన శ్రీ పద్మావతీ జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాల హెచ్ఎం వెంకటరమణారెడ్డి మాట్లాడుతూ విద్యలో వెనుకబడిన వారిలోని లోపాలను వివరించారు. ప్రత్యేక శిక్షణ ద్వారా అధిగమించవచ్చని తెలిపారు. ఆనంతరం విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఐఈడిఎస్ఎస్ టీచర్ కె ఉదయ్ కుమార్, భవిత టీచర్స్ శ్యామలాదేవి, వెంకట రాజేశ్వరి, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

విద్యుత్ ప్రమాదాల నుండి జాగ్రత్తలు తీసుకోవాలి

విద్యుత్ అసిస్టెంట్ ఇంజనీర్ చలపతి

ప్రజాశక్తి- బుచ్చినాయుడు కండ్రిగ: మండలంలోని విద్యుత్ శాఖ అధికారి చలపతి వర్షాల కారణంగా విద్యుత్ ప్రమాదం నుండి తగు జాగ్రత్తలు తీసుకోవాలని వివరించారు. వర్షాకాలంలో తడిసిన కరెంట్ స్థంబాలను తాకకూడదని, తడి చేతులతో స్టార్టర్లు, మోటార్లు ముట్టుకోకూడదని తెలిపారు. విద్యుత్ లైన్‌కు తగులు తున్న చెట్లను ముట్టుకోకూడదని, విద్యుత్ లైన్‌కు చెట్టు కొమ్మలు తగిలితే సంబంధిత అధికారికి తెలపాలన్నారు. పార్కులలోనూ, స్టేడియంలోనూ విద్యుత్ స్తంభాలు ముట్టుకోకూడదని వివరిం చారు. ఇంట్లో ఉన్న స్విచ్ బోర్డులను తడి చేతులతో తాకకూడదని, బయట పెట్టిన లైట్లు, నీటితో తడవకుండా చూసుకోవాలన్నారు. విద్యుత్‌కు సంబంధించిన వస్తువులు తడి చేతులతో ముట్టుకో కూడదన్నారు. చిన్న పిల్లలను విద్యుత్ వస్తువుల వద్దకు రాకుండా చూసు కోవాలని, ఉతికిన దుస్తులు, ఇనుప తీగలపై వేయ కూడదన్నారు. గాలి, దుమారం, వర్షం వల్ల తెగిన విద్యుత్ వైర్ల వద్దకు వెళ్లకూడదన్నారు. వాటర్ హీటర్ స్విచ్ ఆఫ్ చేసి ప్లగ్ తీసిన తర్వాతే నీళ్లు పెట్టిన వస్తువును తీసుకోవాలన్నారు. ఉరుములు, మెరుపులతో వర్షం పడేటప్పుడు డిష్ కనెక్షన్ తీసివేయాలని, వర్షం సమయంలో టీవీ, ఫ్రిడ్జ్, కంప్యూటర్‌ల స్విచ్‌లు ఆఫ్ చేయాలని లేకుంటే వైర్లు షార్ట్ సర్క్యూట్ అయ్యే అవకాశం ఉంటుందన్నారు. విద్యుత్ లైన్ కింద సెల్ ఫోన్ మాట్లాడకూడదని తెలిపారు. ఇంట్లోకి వచ్చే సర్వీస్ వైర్ డ్యామేజ్ వుంటే విద్యుత్ సబ్ స్టేషన్‌కు తెలిపి జెఎల్ఎం, ఏఎల్ఎం, ఎల్ఎం లేదా ఏఈ దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు. విద్యుత్ శాఖ సంబంధిత అధికారులకు తెలపాలని ఆయన కోరారు.

ఎస్వియూలో వివిధ కోర్సుల ప్రత్యేక సీట్లకు అడ్మిషన్లు

ప్రజాశక్తి - క్యాంపస్ : శ్రీ వేంకటేశ్వర విశ్వ విద్యాలయంలోని ఇంజనీరింగ్ ఎంటెక్ కోర్సు (కెమికల్, సివిల్, కంప్యూటర్, ఎలక్ట్రికల్ , కమ్యూనికేషన్స్, మెకానికల్ ఇంజనీరింగ్), ఎస్వీయూ ఫార్మసీ కళాశాలలో ఎం ఫార్మసీ, బి ఫార్మసీ కోర్సులలో ప్రత్యేక ఫీజు చెల్లింపు సీట్లలో చేరాలనుకున్న విద్యార్థులు ఈ నెల 21వ తేదీ వరకు ఆప్లై చేసుకోవచ్చని, అప్లై చేసుకున్న అభ్యర్థులకు అడ్మిషన్ తేదీ ఫోన్ ద్వారా సమాచా రం అందిస్తామని శ్రీ వేంకటేశ్వర యూనివర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య యం భూపతినాయుడు తెలిపారు. మంగళ వారం ఆయన మాట్లాడుతూ ఈ కేటగిరి కింద ఎం టెక్ లో చేరడానికి గేట్ -2024 మొదటి ప్రాధాన్యత, ఏపి పిజి ఈసెట్ -2024 రెండవ ప్రాధాన్యత, బి.టెక్ వారికి చివరి ప్రాధాన్యత అడ్మిషన్లలో ఇస్తామని పేర్కొన్నారు. ఎం ఫార్మసీ కోర్సులో చేరడానికి జీ ఫ్యాట్ 2024 వారికి మొదటి ప్రాధాన్యత, ఏపి పిజి ఈసెట్ -2024 రాసిన వారికి రెండవ ప్రాధాన్యత, బి ఫార్మసీ వారికి చివరి ప్రాధాన్యత ఇస్తామని తెలిపారు. బి ఫార్మసీలో చేరడానికి ఇఏపి సెట్ -2024 రాసిన వారికి మొదటి ప్రాధాన్యత, ఇంటర్మీడియట్ (ఎమ్‌పిసి, బైపిసి) చదివిన వారికి చివరి ప్రాధాన్యత ఇస్తామని తెలిపారు. ఎంటెక్ కోర్సుకు ప్రత్యేక ఫీజు సంవత్సరానికి 1లక్ష42వేలా 980 రూపాయలు అని పేర్కొన్నారు. ఎం ఫార్మసీ కోర్సుకు ప్రత్యేక ఫీజు సంవత్సరానికి 1లక్షా53వేలా 940 రూపాయలు అని తెలిపారు. బి ఫార్మసీ కోర్సుకు ప్రత్యేక ఫీజు సంవత్సరానికి 81 వేల రూపాయిలు చెల్లించాల్సి ఉంటుందని వారు తెలిపారు. మరిన్ని వివరాలకు డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు ఎస్వియు యూనివర్సిటీ. ఇడియు.ఇన్/ డివోఏ వెబ్‌సైట్‌ను చూడవచ్చని తెలిపారు. ఈ అడ్మిషన్ ప్రక్రియ ఎస్వీయూ డీవోఏ చేపడుతుందని తెలిపారు.

'అబ్దుల్ కలాం ఆశయాలను కొనసాగించాలి'

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు పట్టణంలోని డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో డిఆర్ డబ్ల్యు మహిళా కళాశాలలో ఆ కళాశాల ప్రిన్సిపాల్ హనుమంతరావు, మయూరి శ్యామ్ యాదవ్ అధ్వర్యంలో అబ్దుల్ కలాం 93 వ జయంతిని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మయూరి శ్యామ్ యాదవ్ మాట్లాడుతూ డాక్టర్ ఎపిజె అబ్దుల్ కలాం భారతదేశానికి గొప్ప శాస్త్రవేత్త, ఇంజనీర్, 11వ రాష్ట్రపతి అని పేర్కొన్నారు. ఆయనను 'మిసైల్ మ్యాన్ ఆఫ్ ఇండియా'గా పిలుస్తారన్నారు. అబ్దుల్ కలాంను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. ఆయన ఆలోచనలు ఇప్పటికీ యువ తరాన్ని ముందుకు తీసుకెళ్లేందుకు స్ఫూర్తినిస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు అధ్యక్షులు తాజుద్దీన్ పాల్గొన్నారు.

డిడబ్ల్యు కళాశాలలో అబ్దుల్ కలాంకు నివాళులర్పిస్తున్న దృశ్యం

మహారాజశ్రీ గూడూరు సీనియర్ సివిల్ జడ్జివారి కోర్టులో
I.P. No.24/2023
Nasina Suneetha ...Petitioner
Vs
1. Sidhabhatuni Venkata Vijay Kumar
2. Royyala Soujanya
3. Annem Prem Kumar
4. Orampati Srinivasulu
5. Challa Venkateswarlu ...Respondents
జనరల్ నోటీసు
పై నెంబరున పిటిషనరు తనని ఇన్‌సాల్వెంట్‌గా డిక్లేర్ చేయమని కోరుతూ పై తెలిపిన కోర్టులో ఐ.పి.నెం.24/2023ను దాఖలు చేసియున్నందున సదరు ఐ.పి.పై ఎవరికైనను ఆక్షేపణలు ఉన్న యెడల తేదీ: 21.10.2024న ఉదయం 10:30 గంటలకు మీరు స్వయంగా గానీ లేదా వకీలు ద్వారా గానీ పై తెలిపిన కోర్టులో హాజరై ఆక్షేపణలు తెలుపు కోవలసినదిగా యిందు మూలంగా యావన్మందికి తెలియజేయడమైనది.
యస్.కె.నాగూరు, B.Com., L.L.B.,
పిటిషన్ తరపు న్యాయవాది, గూడూరు
సెల్: 6281449260

మహా రాజశ్రీ శ్రీకాళహస్తి సీనియర్ సివిల్ జడ్జి కోర్టులో
O.S No.50 / 2014
Between:
కోలా మునెయ్య ....వాది
మరియు
అద్దంకి మునిశేఖర్ వగైరా ...ప్రతివాదులు
టు,
D5) నూతలపాటి రత్నమ్మ, W/o లేట్ రమేష్ నాయుడు, డోర్‌నెం. 4-18, గాండ్ల వీధి, ఏర్పేడు గ్రామం మరియు మండలం, తిరుపతి జిల్లా.
సమన్లు
ఇందుమూలముగా పై కేసు నందు 5వ ప్రతివాది అయిన నీకు తెలియజేయడం ఏమనగా పై కేసు నందు మీ హాజరు కోరుతూ పై కోర్టునందు 17-10-2024న కలదు. కావున మీరు గాని మీ తరపున ప్లీడరు గాని 17-10-2024న ఉదయం 10.30 గంటలకు పై కోర్టు నందు హాజరై మీ ఆక్షేపణలు ఉన్న యెడల తెలుపుకొనవచ్చును. అట్లు హాజరు కాని పక్షములో మీ పరోక్షమున కేసు తీర్మానించబడునని తెలియజేయడమైనది.
ఇట్లు
సి. వెంకటస్వామి,
వాది తరపు న్యాయవాది, శ్రీకాళహస్తి.

మహారాజశ్రీ గూడూరు సీనియర్ సివిల్ జడ్జివారి కోర్టులో
I.A. No.122/2021
O.S.No.34/2021
పట్టాబి మురళి హరీష్ రాజు ...పిటిషనరు/వాది
వర్సెస్
చల్లా రాజేశ్వరి మరియు వగైరాలు
...రెస్పాండెంట్స్ / ప్రతివాదులు
నోటీసు 2వ రెస్పాండెంట్/ప్రతివాది
చింతగింజల సాయిరాం, తండ్రి లేట్ వెంకట రమణయ్య, డో.నెం.12/235, మల్లమ్మగుడి, వెంకటగిరి టౌన్, తిరుపతి జిల్లా.
ఇందుమూలముగా తెలియజేయడం ఏమనగా పై నెంబరు కేసు నందు గౌరవనీయులైన గూడూరు సీనియర్ సివిల్ జడ్జి కోర్టు వారు మీకు నోటీసును తేది 22.10.2024న వాయిదా వేసియున్నారు. కావున ఎట్టి అభ్యంతరములు ఉన్న యెడల పై తెలిపిన కోర్టు నందు 22.10.2024 తేది ఉదయం 10:30ని॥లకు స్వయంగా గానీ, వకీలు ద్వారా గానీ హాజరై ఆక్షేపణలు తెలుపుకోవలసినది. లేని యెడల ఎటువంటి అభ్యంతరములు లేనట్లుగా భావించి మీ పరోక్షమున తీర్మానించబడును.
యస్.కె.నాగూరు, B.Com., L.L.B.,
పిటిషన్ తరపు న్యాయవాది, గూడూరు
సెల్: 6281449260

IN THE COURT OF THE ADDITIONAL SENIOR CIVIL JUDGE : TIRUPATI
I.A.No-131/2023,
I.A. No-132/2023
I.A. No.133/2023,
I.A. No.134/2023
I.A. No- 135 / 2023
O.S. NO. 44 / 2016
1) S.Abdul Khadar, S/o late Karim Saheb(Died)
2) S.Asiabee, w/o S.Abdul Khadar and others
...Petitioners/Plaintiffs
Vs.
S.Akbar Basha, S/o late Karim Saheb and others
...Respondents/Defendants
NOTICE TO RESPONDENT No-R1, 2 AND 7
R1) S.Akbar Basha, S/o late karim Saheb, Muslim, r/o D.No-6-4-346, Gali Street, Tirupati, Tirupati District
R2) S.Ziya Uddin, S/o late S.Hidayathullah, Muslim, r/o D.No-6-4-414, Gali Street, Tirupati, Tirupati District
R7) S.Havamma w/o Jaffer sahib, Muslim, r/o D.No-6-4-346, Gali Street, Tirupati, Tirupati District
Please take notice that the above suit is filed against to you No-1, 2 and 7 by the first plaintiff for seeking the relief of partition. After first plaintiff died the L.Rs of the 1st plaintiff filed the above petitions, the said Petitions I.A. No.131 /2023, I.A. No.132 /2023, I.A. No.133 /2023, I.A. No.134 /2023, I.A. No.135 /2023 in O.S. No.44 /2016 is posted for your appearance on 28-10-2024 in the above said Hon'ble court and you No-1, 2 and 7 should appear either in person or through your counsel at about 10.30 a.m. in event of your absence the matter will be decided ex-parte.
Hearing date: 28.10.2024
N.SARADA
C.PRABHAKAR
ADVOCATES TIRUPATI